క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలోని గోదావరి హోమ్స్, గాయత్రినగర్, టీఎస్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తా



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేటర్ 33వ డివిజన్‌లో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సంబంధిత అధికారులకు సమస్యలను వివరించి పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నాగరాజుయాదవ్‌కు సన్మానం



నాగరాజును సత్కరిస్తున్న స్వామి వివేకానంద యువజన సంఘం సభ్యులు

రంగారెడ్డినగర్: గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ నాగరాజు యాదవ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ అమొయ్ కుమార్, మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. గురువారం స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జిల్లా లక్ష్మీనాథ్ ఆధ్వర్యంలో సభ్యులు నాగరాజునుకు అభినందనలు తెలియజేసి శాలువతో సత్కరించారు. మీసాల సత్యనారాయణ, నీలగిరి, తిమ్మయ్య, జగన్, సురేష్, దత్తు గౌడ్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగు పర్చండి



జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి ప్రతం అందజేస్తున్న భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు

రంగారెడ్డినగర్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని గురువారం మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా నీటి సరఫరా లోప్రెషర్‌తో వస్తోందన్నారు. దీంతో సరిపడా నీరు అందడం లేదన్నారు. అదే విధంగా భగత్‌సింగ్‌నగర్ రోడ్డు నం.9లో హ్యాండ్ బోర్‌వెల్ ఎత్తు పెంచి ప్రజలకు అందుబాటులో తేవాలని కోరారు. దీనిపై స్పందించిన జీఎం శ్రీధర్‌రెడ్డి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండల శ్రీనాథరావు, ఉపాధ్యక్షుడు పరుశరామ్, సభ్యులు సత్తిరెడ్డి, సంజీవ్ ఉన్నారు.

ఏఐ, ఎంఎల్‌పై శిక్షణ

అక్టోబర్ 3నుంచి 18వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, ఐహబ్ డేటా కలిసి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/ మెషిన్ లెర్నింగ్‌పై రెండు వారాల ఎగ్జిక్యూటివ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పరిశోధనా సంస్థలు లేదా ఇతర ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న యువ శాస్త్రవేత్తలు/విశ్లేషకుల కోసం ఉద్దేశించబడిందని నిర్వాహకులు తెలిపారు. ఏఐ/ఎంఎల్ పద్ధతులు, ఏఐ/ఎంఎల్ సాధనాలు/ లైబ్రరీల వినియోగం, ప్రజా వనరుల వినియోగం (డేటాసెట్‌లు, శిక్షణ పొందిన నమూనాలు), సమకాలీన సమస్య తదితరాలను పాల్గొనేవారికి పరిచయం చేస్తారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ ఆర్ అండ్ డీ డీన్ ప్రొఫెసర్ సీవీ జవహర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు.

బస్ బే బస్సు రాదే!



బస్‌బే ఆక్రమణకు గురి కావడంతో నర్సాపూర్ రాష్ట్ర రహదారిపై నిలుపుతున్న బస్సులు

- ప్రయాణికులను రోడ్డుపైనే ఎక్కించుకుంటున్న డ్రైవర్లు
- లారీల పార్కింగ్‌కు అడ్డాగా మారిన బస్ బేలు
- బస్సులు లోపలకి రాకపోవడంతో రోడ్డుపై నిలబడాల్సిన దుస్థితి
- బస్టాప్‌లు ఉండి ఏమి లాభమంటున్న ప్రయాణికులు



షాపూర్‌నగర్ రైతు బజారు ఎదురుగా ఉన్న బస్టాప్‌లో డీసీఎంలను పార్కు చేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాప్‌లు పార్కింగ్ అడ్డాలుగా మారుతున్నాయి. దీంతో బస్‌బేలోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్ షెల్టర్లను నిర్మించారు. అయితే కొన్ని చోట్ల అవి అక్రమణలకు గురవుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

◆ షాపూర్‌నగర్ రైతు బజారు ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్ జీడిమెట్ల పారిశ్రామికవాడకు ఆనుకుని ఉండటంతో బస్‌బే డీసీఎం వాహనాలకు పార్కింగ్ అడ్డాగా మారింది. అదే విధంగా బస్‌షెల్టర్‌లో కొందరు వ్యక్తులు తిష్టవేశారు. దీంతో నిలుచోవడానికి నిలువ నీడలేక పోవడంతో ఎండలోనే ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూస్తున్నారు.

◆ బస్ బేను అక్రమించడంతో ఆర్టీసీ బస్సులు రోడ్డుపైనే నిలుపుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు బస్సులను రోడ్డుపై నిలుపడంతో ఇతర వాహనాలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఒక్కోసారి త్వరగా బస్సు ఎక్కాలనే ఆతృతతో ప్రయాణికులు రోడ్డుపై పడి గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి.

◆ గాంధీనగర్ పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న రంగారెడ్డినగర్ బస్టాప్‌లో మర్మతులకు తీసుకువచ్చే ఆటోలను నిలుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతోంది.

◆ షాపూర్‌నగర్ చౌరస్తాలోని గాజులరామారం రోడ్డులో ఉన్న బస్టాప్‌లో, ఐడీపీఎల్ చౌరస్తాలోని బస్టాప్‌లలో ఆటోవాలాలు తిష్ట వేయడంతో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్టీసీ సిబ్బందిని నియమించాలి..

ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న బస్టాప్‌లు అక్రమణలకు గురి కాకుండా, బస్సులను బస్‌బేలలో నిలిపే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్టీసీ సిబ్బందిని నియమించి బస్‌బేలలో ఇతర వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రంగారెడ్డినగర్ బస్‌షెల్టర్‌లో రిపేరుకు ఉంచిన ఆటో



కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో అమరులకు నివాళులర్పిస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

అమరుల త్యాగాలతోనే తెలంగాణ

అమరుల త్యాగాలతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరించిందని, వారు తెలంగాణ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరుల స్తూపం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా తెలంగాణ కోసం ఆత్మ బలిదానాలు ఇచ్చిన అమరుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్



దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న, చైర్‌పర్సన్ కృష్ణవేణి, ప్రజాప్రతినిధులు



అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే వివేకానంద్

వృథాగా తాగునీరు... రోడ్డుపై ఇబ్బందులు



గాజులరామారం రోడ్డు సంజయ్‌గాంధీనగర్ వద్ద నిలిచిన తాగునీరు

సుభాష్‌నగర్: ఓవైపు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మంచినీళ్ల పండుగ, మరోవైపు వారం రోజులుగా విలువైన మంచినీరు పెద్ద మొత్తంలో వృథా. ఇదంతా షాపూర్‌నగర్‌లోని వాటర్ వర్క్స్ సబ్ డివిజన్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న షాపూర్‌నగర్ – గాజులరామారం ప్రధాన రోడ్డులో దృశ్యం.. ఇంత పెద్ద మొత్తంలో వృథాగా పోతున్న తాగునీటికి అడ్డకట్ట వేయండని ఈనెల సాక్షి వెలుగులో తీసుకువచ్చింది.

◆ 19న వాటర్ వర్క్స్ డీజీఎం, ఏఈ రమ్య, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి, జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్‌కుమార్ సందర్శించారు. 24 గంటల్లో పూర్తి చేస్తామని డీజీఎం అప్పలనాయుడు పేర్కొన్నారు. అందుకు ట్రాఫిక్ అధికారులు అర కిలోమీటర్ మేర పనులు చేయడానికి నిర్ధారించారు. నాలుగు రోజులు గడుస్తున్న మళ్లీ ఇక్కడికి వచ్చి చూసిన పాపన పోలేదు. 450 ఎంఎం సామర్థ్యం ఉన్న పైప్‌లైన్ పగిలి 24గంటల పాటు పెద్ద మొత్తంలో నీరు పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



గాజులరామారం రోడ్డులోని రామారం వైన్స్ వద్ద మురికి కాల్వను తలపిస్తూ..

300 మీటర్ల దూరంలో రోడ్డుపై మురుగు..

ఇదే రోడ్డులో మంచినీరు లీకేజీ ప్రాంతం నుం 300 మీటర్ల దూరంలో ఉన్న రామారం వైన్స్ వద్ద నాలుగు రోజుల నుంచి డ్రైనేజీ రోడ్డుపై నుంచి మురికి కాల్వగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రోడ్లలో రోజుల తరబడి సమస్య ఇంత జఠిలంగా ఉంటే అధికార యంత్రాంగం ఏం చేస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఇక అధికారులు ఏం చర్యలు చేపడతారో చూడాల్సిందే.


'నిరంకుశ పాలన అంతమయ్యే రోజు దగ్గర్లోనే ఉంది'

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: దశాబ్ది కాలంగా తెలంగాణాలో కొనసాగిన నిరంకుశ పాలన అంతమయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కేసీఆర్ దశాబ్దిదగా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ నుంచి కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు నిరంకుశ పాలనను నిరసిస్తూ వినతి పత్రం అందజేశారు.

◆ ఈ సందర్భంగా భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కేజీ నుంచి పీజీ ఉచిత నిర్బంద విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, పోడు భూములకు పట్టాలు, రైతు రుణ మాఫీ, గిరిజనులకు రిజర్వేషన్లు అమలు చేయకుండా దశాబ్ది కాలంగా మోసం చేశారని ఆరోపించారు.

◆ వచ్చే ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోవడం ఖాయమని తేలడంతోనే ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఇలాంటి ఆర్భాటాలకు తెరలేపారని అన్నారు. దశాబ్ది ఉత్సవాల ముసుగులో ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ – బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రాచనోళ్ల లక్ష్మి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సదానందం, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



డీసీ మంగతాయారుకు వినతి పత్రం అందేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి

స్మార్ట్ వాటర్ మీటర్‌తో నీటి ఆదా

- హెచ్‌సీయూ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ విద్యార్థి అంకిత్‌రాజ్ రూపకల్పన
- టీఎస్ పీసీబీ ఎకో ఛాంపియన్స్ హ్యాకథాన్‌లో 3వ బహుమతి

రాయదుర్గం: నీటి వినియోగం తగ్గింపు కోసం స్మార్ట్ వాటర్ మీటర్ నెట్‌వర్క్ నిర్వహణను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి ప్రతిపాదించారు. అంకిత్‌రాజ్ హెచ్‌సీయూలో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ చేస్తున్నాడు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) నీటి వినియోగం తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తగ్గింపు రెండు అంశాల కింద ముఖ్యమైన సమస్యలను ఛేదించడానికి వినూత్న ఆలోచనలు, పరిష్కారాలను ఆహ్వానించింది. అందుకోసం 'ఎకో చాంపియన్స్ హ్యాకథాన్'ను నిర్వహించింది. ఇందులో అంకిత్‌రాజ్ స్మార్ట్ వాటర్ మీటర్ నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్' పేరుతో థీసిస్ సమర్పించారు. ఇందులో సుమారు 300 బృందాలు పాల్గొన్నాయి. అందులో అంకిత్‌రాజ్ మూడవ బహుమతి పొంది రూ.20వేల నగదు పురస్కారం అందుకున్నారు.

ఆశీర్వాదం..



తెలంగాణ శాసనమండలి ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు కుమారుడు దీపక్‌రావు తన జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ప్రగతిభవన్‌లో సీఎం చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. – కుత్బుల్లాపూర్

బీఆర్‌ఎస్ నాయకుడు తిరుపతికి నివాళి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు, అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర కోశాధికారి ఎడగోటి తిరుపతి (39) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. తిరుపతి తండ్రి ఎల్లయ్య బాలయ్యనగర్ బస్తీని స్థాపించారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కూన శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజా శ్రీనివాస్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, పలు పార్టీల నాయకులు తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. తిరుపతి అంత్యక్రియలు శుక్రవారం జరగనున్నట్లు బంధువులు తెలిపారు.



తిరుపతి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

బస్తీ దవాఖానాలపై పర్యవేక్షణ కరువు

- వైద్యులు, సిబ్బంది రాకపోయినా వచ్చినట్లు అటెండెన్స్
- రోగులకు అందుబాటులోకి రాని వైద్య సేవలు
- వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్

చింతల్: బస్తీ దవాఖానాలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్తీ ప్రజలకు వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రావడం లేదు. చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో బస్తీ దవాఖానా వైద్యుడు కొంత కాలంగా విధులకు హాజరు కావడం లేదని... అటెండర్‌తో రిజిస్టర్‌లో ప్రతిరోజు దవాఖానాకు వస్తున్నట్లుగా అటెండెన్స్ మాత్రం వేయించుకున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం ఆరోపిస్తోంది.

◆ వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్ వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోందని పలువురు వాపోతున్నారు. బస్తీ దవాఖానా వైద్యుడు నెలకు రూ.52వేల జీతం ప్రతినెలా తీసుకుంటూ విధులకు దుమ్మాకొట్టి ప్రైవేట్‌గా వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిస్తున్నాయి.



భగత్‌సింగ్‌నగర్‌లోని బస్తీ దవాఖానా

◆ గతంలో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి నందానగర్ బస్తీ దవాఖానా వైద్యుడు సైతం ఇదే తరహాలో దుమ్మాలు కొడుతూ జీతాలు తీసుకునేవాడన్నారు. ఫిర్యాదులు రావడంతో వృత్తికి రిజైన్ చేశారని.. భగత్‌సింగ్‌నగర్ బస్తీ దవాఖానా వైద్యుడికి సైతం అదే పరిస్థితి తప్పదని భగత్‌సింగ్‌నగర్ సంక్షేం సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ ఉన్నతాధికారులను ప్రజలకు సేవలు అందించకుండా అన్యాయం చేస్తున్న బస్తీ దవాఖానా వైద్యుడిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని చింతల్ డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యం

సుభాష్‌నగర్: కేంద్రంలో బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం సర్వతో ముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గాజులరామారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యమన్నారు. తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికలప్పుడే సీఎం కేసీఆర్‌కు ప్రజలు గుర్తుకొస్తారని విమర్శించారు. ఓట్ల కోసం ఎన్ని జిమ్మిక్కులైనా చేస్తారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ సానుకూల పవనాలు చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు గల్లంతు అవుతాయని ఆయన జోష్యం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు తెలపడానికి ప్రతి ఒక్కరూ ఫోన్ నం.90909 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కూన శ్రీనివాస్ గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, స్థానిక నాయకులు రాజిరెడ్డి, ఎం.సాగర్, ఇంద్ర సేనారెడ్డి, సంజీవ రెడ్డి, యాదగిరి, వర్మ, రిషికుమార్, నరేష్ గౌడ్, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్, వెంకటేష్, ఎతి రమేష్, మధుసూదన్, సుబ్బారావ్, బాలరాజు, సుజిత్ రెడ్డి, యశ్వంత్, శ్రీకాంత్ రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, డివిజన్ నాయకులు జ్ఞానీ, రాజిరెడ్డి, సునీల్ పాటిల్, సుఖ్ దేవ్, మధు, బలరాం, రేవతిరెడ్డి, పూలమ్మ, రేవతి, డాన్ శ్రీను, జహంగీర్, లక్ష్మణ్, సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



గాజులరామారం గ్రామంలో బీజేపీ జెండా ఎగుర వేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



పాదయాత్రలో సమస్యలు వింటున్న శ్రీశైలంగౌడ్